క్లుప్తంగా

నాణ్యత పాటించాలి

సరుబుజ్జిలి: విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత పాటించాలని ఎంఈవో కె.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని గోనెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. దీనిలో భాగంగా మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన పథకం, పరిసరాల పరిశుభ్రత పరిశీలించారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనలో అధ్యాపకులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

పక్కాగా ప్రీ స్కూల్ నిర్వహణ

సారవకోట: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ నిర్వహణ పక్కాగా జరగాలని సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో హెచ్.కె.కామాక్షి స్పష్టం చేశారు. మంగళవారం సారవకోట ప్రాజెక్టు కార్యాలయం ఆవరణలో సారవకోట, జలుమూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు పిలుస్తున్నాయి కార్యక్రమం నిర్వహించి కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలని సూచించారు. అలాగే కేంద్రాల నిర్వహణకు కేటాయించి యాప్‌లలో అన్ని మాడ్యుల్స్ తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఆమెతో పాటు సూపర్‌వైజర్లు పద్మావతి, సీతారత్నం, మనోహరి, సునీత తదితరులున్నారు.

విత్తనాలు పంపిణీ

సరుబుజ్జిలి: మండలంలోని రావివలస గ్రామంలో రైతులకు వరి విత్తనాలను సర్పంచ్ వండాన కృష్ణ, మాజీ సర్పంచ్ బొంగు వెంకటరత్నంనాయుడులు మంగళవారం పంపిణీ చేశారు. రైతులకు కావాల్సిన అన్ని సేవలు రైతుసేవా కేంద్రాలు వద్ద అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

చేపల వ్యాన్ బోల్తా



బోల్తాపడిన వ్యాన్

నరసన్నపేట: జాతీయ రహదారిపై గుండవల్లిపేట వద్ద మంగళవారం ఉదయం చేపల వ్యాన్ బోల్తా పడింది. శ్రీకాకుళం నుంచి నరసన్నపేటకు వైపుకు వెళ్లే మార్గంలో వ్యాన్ అతివేగంగా వెళ్తుండగా అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో వ్యాన్ క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది వచ్చి గాయపడిన క్లీనర్‌కు ప్రథమ చికిత్స అందించారు. కొద్దిసేపటికే బోల్తాపడిన వ్యాన్ తొలగించారు.

ఝాన్సీ లక్ష్మీబాయి వర్ధంతి

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలేంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో రామరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి వర్ధంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉన్న ఝాన్సీ లక్ష్మీబాయి విగ్రహానికి ట్రస్టు అధ్యక్షుడు పి.రామరాజు, ప్రిన్సిపాల్ పి.పద్మావతిలు నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.భవానీ, కె.నాగమణి, బి.ప్రమీల, ఐ.శశివర్ణం తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలతో పంటకు నత్రజని

కొత్తూరు: వరి వెదలో నవధాన్యాల విత్తనాలు వేయడం వలన ప్రధాన పంటకు నత్రజని అందుతుందని ప్రకృతి వ్యవసాయం కొత్తూరు సబ్ డివిజన్ మాస్టర్ ట్రెనీ ఎస్.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని శోభనాపురంలో వరి విత్తనాలతో పాటు మినుములు, పెసలు, తోటకూర, జనపకూర, నవధాన్యాల విత్తనాలు కలపి జల్లడంపై మంగళవారం అవగాహన కల్పించారు. నవధాన్యాలు సాగు వలన ఇతర కలుపు మొక్కలు మొలకెత్తే అవకాశం ఉండదన్నారు. అదేవిధంగా భూమిలో తేమ ఎక్కువ కాలం ఉంటుందని చెప్పారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పోలాకి: ఈదులవలస 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ(ఆపరేషన్స్) జి.శంకరరావు తెలిపారు. గొల్లలవలస, తోటాడ, ఎస్ఎల్‌పురం, కొండలక్కివలస, కింజరాపు వానిపేట గ్రామాల వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో మేలు



ప్రకృతి వ్యవసాయ దిగుబడులు విక్రయిస్తున్న సిబ్బంది

ఎల్.ఎన్.పేట: ప్రకృతి వ్యవసాయ సాగుతో ఆరోగ్యవంతమైన దిగుబడులను సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి బి.లలిత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ప్రకృతి వ్యవసాయ దిగుబడుల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతీ ఇంటి పెరటులో ఎలాంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా కూరగాయలు, ఆకు కూరలను పండించుకోవచ్చన్నారు. గ్రామాల్లో రైతులు ముందుకు రావాలని కోరారు. తక్కువ విస్తీర్ణంలో ఎలాంటి పెట్టుబడి లేకుండా ఎక్కువ రకాల పంటలను పండించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు బి.సంతోషి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగు.. భలే బాగు

- ఈ సీజన్‌లో తీగజాతి సాగుతో లాభాలు
- యాజమాన్య పద్ధతులతో దిగుబడులు



పాదవు చిక్కుడు సాగు

ఎల్.ఎన్.పేట: ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమవ్వడంతో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాలకు చెందిన రైతన్నలు అనేక రకాల కూరగాయల పంటలు పండించేందుకు సిద్ధమవుతారు. వీటిలో తీగజాతి కూరగాయల సాగు ఎంతో కీలకమైనది. వర్షాకాలంలో తీగజాతి కూరగాయలు సాగు చేయడం వలన ఇంటి ఖర్చుతో పాటు వ్యాపార ధోరణిలో ఆలోచిస్తే అధిక ఆదాయం సైతం పొందవచ్చును.

అనుకూలమైన వాతావరణం

తీగజాతి కూరగాయల సాగుకు తేమతో కూడిన వేడి వాతావరణం అనుకూలం. ఇవి అధిక ఉష్ణోగ్రతను, ఎక్కువ మంచును గానీ తట్టుకోలేవు. ఉష్ణోగ్రత 25 నుంచి 35 డిగ్రీల వద్ద తీగ జాతి పెరుగుదల బాగుండి మంచి దిగుబడులు ఇస్తుంది. ఉష్ణోగ్రత 18 డిగ్రీల కంటే తక్కువగా ఉంటే పెరుగుదల తగ్గి పూత, పిందె రావడం ఆలస్యం అవుతుంది. 36 డిగ్రీల కంటే ఎక్కువ ఉంటే ఆడపూల సంఖ్య తగ్గి, మగ పూల సంఖ్య పెరిగి దిగుబడిపై దెబ్బతీస్తుంది.

నాణ్యమైన విత్తనమే ప్రధానం

మార్కెట్‌లో అనేక కంపెనీలకు చెందిన విత్తనాలు ఆకర్షణీయమైన ప్యాకెట్లలో విక్రయిస్తున్నారు. నమ్మకమైన దుకాణాల్లో నమ్మకమైన కంపెనీ విత్తనాలను కొనుగోలు చేసుకోవాలి. ఆయా ప్రాంతాలకు అనుకూలమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. జూలై నెలాఖరు వరకు విత్తనాలు నాటుకోవచ్చు. విత్తనాలు వేసుకునే ముందు విత్తన శుద్ధి, గత్తం వేసుకోవడం ఎంతో మంచిది. తీగజాతి కూరగాయల్లో బీర, కాకర, ఆనపకాయ, పొట్ల, దోసకాయ, దొండ, గుమ్మడి, బూడిద గుమ్మడి, పాదవు చిక్కుడు, పందిరి చిక్కుడు, జునుము, ఆగాకర తదితర రకాలు ఉన్నాయి. అలాగే తీగ జాతిలో ఆయా రకాల విత్తనాలను బట్టి విత్తే దూరం పాటించాలి. విత్తనాలు మొలకెత్తిన తర్వాత వారం రోజుల వరకు నీటి తడిని ఇవ్వాలి.

ఎరువుల యాజమాన్యం

భూమిని కలియదున్ని ఆఖరి దుక్కిలో ఎకరాకు 200 కిలోల వేప పిండి, 10 టన్నుల పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. ఎకరాకు 24 నుంచి 32 కిలోల భాస్వరం, 20 కిలోల నుంచి 24 కిలోల పోటాష్‌నిచ్చే ఎరువులను అన్ని పాదుల్లో సమానంగా వేయాలి. 32 నుంచి 40 కిలోల నత్రజనిని 20 నుంచి 25 రోజులకోసారి పూత, పిందె దశలో మరోసారి వేయాలి. మొక్కకు 10 నుంచి 15 సెంటీమీటర్ల దూరంలో గొయ్యి తవ్వి ఎరువును వేసి మట్టితో కప్పి నీటి తడిని ఇవ్వాలి. ఆడ పువ్వుల సంఖ్య పెంచేందుకు బోరాక్స్ ద్రావణాన్ని 2 నుంచి 4 ఆకుల దశలో పిచికారీ చేయాలి. జీవన ఎరువులను వేసుకోవడం కూడా మంచిదే.



పందిరి కూరగాయల సాగు

పెరటి పంటలు సాగు చేయాలి

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ ఇంటివారు కూరగాయలతో పాటు ఆకుకూరల పంటలను పెరటి పంటలుగా సాగు చేసుకోవాలి. ఇంటి కూరగాయల ఖర్చు తగ్గించుకోవడంతో పాటు వ్యాపారులకు విక్రయించడం వలన అదనపు ఆదాయం పొందవచ్చును. చిన్నపాటి యాజమాన్య పద్ధతులు పాటించడం వలన తక్కువ పెట్టుబడితో ఆధిక దిగుబడిని సాధించవచ్చు.

– తమ్మినేని విమల, వీహెచ్ఏ, ఎల్.ఎన్.పేట

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు

సారవకోట: రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి పి.చైతన్య కుమార్ సూచించారు. మండలంలోని అడ్డవనస గ్రామంలో ధర్మాన తేజ్ కుమార్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన ప్రాణప్రాయ స్థితిలో ఉన్నవారికి ప్రాణదానం జరుగుతుందన్నారు. అందువలన రక్తదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శిబిరంలో 265 మంది యువకులు రక్తదానం చేశారు. సురవరపు తిరుపతిరావు, పిళ్ల నంద కుమార్, కోన వెంకటేష్ తదితరులున్నారు.

యోగా డే విజయవంతం చేయండి



సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు కృష్ణప్రసాద్, నారాయణరెడ్డిలు

ఆమదాలవలస: ఈనెల 21వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పెడన, మార్కాపురం ఎమ్మెల్యేలు కాగితపు కృష్ణ ప్రసాద్, కందుల నారాయణరెడ్డిలు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా చేపట్టనున్న యోగా డేకు ఆమదాలవలస నియోజకవర్గ పరిశీలకులుగా ప్రభుత్వం వారిని నియమించిందని తెలిపారు. ఈ మేరకు స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు ఇరువురు నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌తో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పీరికట్ల విశ్వప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, నాయకులు మొదలవలస రమేష్, తమ్మినేని సుజాత, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి



కృష్ణారావుకు స్వాగతం పలుకుతున్న పెన్షనర్లు

ఆమదాలవలస: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని సబ్ ట్రెజరీ అధికారి బి.కృష్ణారావును పెన్షనర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సిమ్మి నాయుడు, బొడ్డేపల్లి జనార్ధనరావులు కోరారు. మంగళవారం సబ్ ట్రెజరీ కార్యాలయంలో నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన కృష్ణారావును పెన్షనర్లు మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలు తెలియజేశారు. ఈ సందర్భంగా సబ్ ట్రెజరీ అధికారి మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి మోహనరావు, కోశాధికారి హెచ్‌పీ సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కె.షణ్ముఖరావు, బొడ్డేపల్లి జోగారావు, బెండి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏడు ఊర్ల పండగ.. ఎంతో వైభవంగా



పొందూరు పైడితల్లమ్మ ఏడు ఊరుల పండగ ఎంతో వైభవంగా జరుగుతోంది. దీనిలో భాగంగా మంగళవారం ఘటాల ఊరేగింపు జరిపారు. దీంతో ఆయా గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– పొందూరు



పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఎంఈవో దాలినాయుడు

నరసన్నపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, ఈ మేరకు ఉపాధ్యాయులు గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంఈవో శాంతారావు, దాలినాయుడులు సూచించారు. నరసన్నపేటలో మంగళవారం స్కూల్ హెచ్ఎంల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకటో తరగతిలో చేరిన విద్యార్థుల పేర్లు యూ డైస్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసిన విద్యార్థుల కిట్స్ పంపిణీ చేయాలని ఆదేశించారు.

50 మంది ఉపాధ్యాయులు బదిలీ

పాతపట్నం: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 50 మంది ఉపాధ్యాయులకు బదిలీలు అయినట్లు ఎంఈవో-2 సీహెచ్ తిరుమలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ మండలాల నుంచి 28 మంది ఉపాధ్యాయులు పాతపట్నం మండలానికి వచ్చారన్నారు. అలాగే పాతపట్నం మండలం నుంచి వేరే మండలాలకు 22 మంది ఉపాధ్యాయులు రిలీవ్ అయ్యాయరని తెలిపారు. ఇక్కడకు వచ్చిన 28 మంది ఉపాధ్యాయులు బాధ్యతలను స్వీకరించారన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



సూర్యనారాయణ స్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో జ్యేష్ట బహుళ షష్టి పురస్కరించుకొని స్వామివారి కల్యాణ మహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ధర్మకర్త శిమ్మ అచ్యుతరామయ్య దంపతులచే కల్యాణాన్ని అర్చకులు కృష్ణబాబు ఆధ్వర్యంలో సత్యవరాగ్రహారానికి చెందిన రుత్వికులు జరిపించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సూర్యారావు మృతి తీరని లోటు



సూర్యారావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న రవికుమార్ తదితరులు

బూర్జ: మండలంలోని కొరగాం గ్రామానికి చెందిన బెవర సూర్యారావు మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటు అని ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. సోమవారం సూర్యారావు మృతి చెందడంతో మంగళవారం ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సరుబుజ్జిలి జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, బూర్జ జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, బూర్జ మండల పార్టీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, పొందూరు వైస్ ఎంపీపీ వండాన వెంకటరావు, రాపాక సర్పంచ్ కొంచాడ గిరిబాబు, ఏఎంసీ మాజీ చైర్మెన్ గుమ్మడి రాంబాబు, బూర్జ వైస్ ఎంపీపీ కర ణం కృష్ణంనాయుడు, వైకుంఠపురం గ్రామ సర్పంచ్ బొడ్డేపల్లి వెంకటసత్యం, నాయకులు మజ్జి నర్సింగరావు, జల్లు బలరాంనాయుడు తదితరులు ఉన్నారు.

కూటమి పాలన అంతా మోసమే



వెన్నుపోటు పుస్తకావిష్కరణ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: ఏడాది కూటమి పాలన అంతా మోసాలమయమేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో జగన్ అంటే నమ్మకం - చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని నియోజకవర్గ నాయకులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. వారికి అధికారం దాహం తప్ప ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన లేదని దుయ్యబట్టారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేసి, కేసులు, దాడులకు దిగుతుండడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ తప్పుడు విధానాలను ప్రశ్నించే ఎంతో మంది సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారని మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చినప్పటినుంచి అశాంతి, అరాచకం, అక్రమాలు, అవినీతి రాజ్యమేలుతున్నాయని ధ్వజమెత్తారు.

అవినీతిలో మామిడి ముందంజ

పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అవినీతిలో రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉన్నారని ఆరోపించారు. ఇసుక వ్యాపారం, ప్రభుత్వ భూముల అక్రమణలు, ఎటువంటి అనుమతులు లేకుండా ఒడిశాకు ఇసుక తరలింపు, మద్యం వ్యాపారం తదితర అవినీతి వ్యాపారాలు చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. సమావేశంలో ఎల్ఎన్‌పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ పి.లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్షుడు మీసాల రామకృష్ణ, గండివలస ఆనంద్, పోలాకి జయమునిరావు, రాష్ట్ర కార్యదర్శి పి.యోగేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి సాంబమూర్తి, రెడ్డి రామారావు, బైపోతు ఉదయ్ కుమార్, ఆర్టీఐ ఎనుగుతల సూర్యం, చింతాడ సూర్యనారాయణ, బి.నారాయణమూర్తి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్లి కృష్ణ, వైస్ ప్రెసిడెంట్లు గోకవలస రామారావు, పనుకు మోహన్, తూలుగు ప్రవీణ్, అలికాన మాధవరావు, సుభాష్, మామిడి గంగాధర్, జనరల్ కార్యదర్శులు చింతాడ త్రినాథరావు, పార్టీ నాయకులు డి.జోగారావు, బొంగు శ్రీరాములు, కె.జనకమ్మ, పోలాకి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది కాలంలో అన్నివర్గాలకు అన్యాయం



వెన్నుపోటు పుస్తకం ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పోలాకి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో అన్నివర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు అన్నారు. మండలంలోని ఈదులవలస జంక్షన్‌లో వెన్నుపోటు పుస్తకాన్ని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజలకు ఈ పుస్తకంలో అంశాలను పార్టీ శ్రేణుల ద్వారా తెలియజేస్తామన్నారు. పోలీసులు, అధికార యంత్రాంగాన్ని వాడుకుని విచ్చలవిడిగా చట్టాలను అతిక్రమిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు రావాడ అప్పన్నరాజు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు రెంటికోట త్రినాథరావు, రాళ్లపాడు సర్పంచ్ బోర సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్నారు



వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆమదాలవలస: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా గత సంవత్సర కాలంగా సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేస్తున్నారని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వెన్నుపోటు పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలతో ప్రతి ఇంట్లో పండగ వాతావరణ ఉండేదని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో మరలా వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి ప్రజలకు సంక్షేమాన్ని దగ్గర చేస్తామని తెలియజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మొండేటి కూర్మారావు, సైలాడ దాసునాయుడు, కూటికుప్పల సన్యాసిరావు, చలపతిరావు, బొడ్డేపల్లి మన్మథరావు, దన్నాన అజయ్‌కుమార్, తిర్లంగి గోవిందరావు, అన్నెపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్యాయాలతో కూటమి పాలన



వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: రాష్ట్రంలో గత సంవత్సర కాలంగా అన్యాయాలు, అఘాయిత్యాలు, వేధింపులు, ప్రతీకారాలతో కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనపై వైఎస్సార్‌సీపీ ప్రచురించిన వెన్నుపోటు పుస్తకాన్ని మండల కేంద్రంలో స్థానిక నేతలతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోసాలకు కేరాఫ్ అడ్రస్‌గా సీఎం చంద్రబాబు నాయుడు ఉంటారన్నారు. రానున్న రోజుల్లో కూటమి నాయకులకు ప్రజలు సమాధానం చెప్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కింజరాపు సురేష్, పున్నపురెడ్డి తవిటి నాయుడు, బద్రి రామారావు, కడగల లక్ష్మణరావు, ఎడ్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం



వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణ చైతన్య తదితరులు

జలుమూరు: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య అన్నారు. మండలంలోని కొమనాపల్లి వైఎస్సార్ జంక్షన్‌లో వెన్నుపోటు పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించి ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు ఎన్నో హామీలు ఇచ్చి, ప్రస్తుతం వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు.

కూటమి పాలనలో అన్నివర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, అల్లాడ సొసైటీ మాజీ అధ్యక్షుడు ఎం.శ్యామలరావు, ధర్మాన జగన్, దామ మన్మథరావు, పైడి విఠలరావు, కె.హరిప్రసాద్, బీవీ రమణ, పంచిరెడ్డి రాజారావు, వెలమల అసిరినాయుడు, కరణం గణపతి, ప్రసాద్, వెలమల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.